విద్యారంగంలో శాశ్వత మార్పులకు భారీ పెట్టుబడులు

వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే గడ్డిపల్లి పాఠశాల పూర్తి చేయాలని ఆదేశం

సూర్యాపేట జిల్లా వాయిస్ టుడే, అక్టోబర్ 6: విద్యారంగంలో శాశ్వత మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెడుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం, నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యాధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌కు మంగళవారం భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం గడ్డిపల్లిలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి పురోగతిని సమీక్షించారు.

రోజూ 60 వేల మందికి పౌష్టిక అల్పాహారం

మునగాల కమ్యూనిటీ కిచెన్ ద్వారా సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం అందించనున్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, విద్యాసంస్థలకు పంపిణీ వరకు సమగ్ర వ్యవస్థను రూపొందిస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ ప్రాజెక్టుకు రూ.9.60 కోట్ల ఆర్థిక సహకారం అందిస్తోంది.

శంకుస్థాపన కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించడం వారి ఆరోగ్యం, చదువు, భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టడమేనని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలను కేవలం ఉచితాలుగా చూడొద్దని సూచించారు. కుటుంబాలను బలోపేతం చేసి, ప్రజలు రాష్ట్రాభివృద్ధిలో మరింత సమర్థంగా భాగస్వాములయ్యేందుకు ఇవి తోడ్పడతాయని వివరించారు.

విద్యతోపాటు పౌష్టికాహారం అవసరం

పిల్లల ఎదుగుదలకు తరగతి గదిలో అందించే విద్యతోపాటు పౌష్టికాహారం కూడా అవసరమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. చిన్న వయసు నుంచే సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం అందితే వారి అభ్యసనానికి తోడ్పడుతుందని చెప్పారు. మునగాల కిచెన్ ద్వారా ప్రారంభంలో దాదాపు 60 వేల మందికి అల్పాహారం అందిస్తామని, భవిష్యత్తులో లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అల్పాహారంతోపాటు పాలు, రాగిజావ అందిస్తామని చెప్పారు.

ఆహార నాణ్యత, పౌష్టిక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని ఉత్తమ్ తెలిపారు. అవసరాలను బట్టి ఎంపిక చేసిన జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించేలా కూడా కార్యక్రమాన్ని విస్తరించే అవకాశం ఉందని అధికారులు వివరించారు. విద్యార్థుల సంక్షేమం, హాజరు, అభ్యసన ఫలితాలు, విద్యాప్రకాశాలను మెరుగుపరిచే ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ఉత్తమ్ అన్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేసుకుంటూ కిచెన్ నిర్మాణం, నిర్వహణను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని చెప్పారు.

పాఠశాల పనులకు వారాల వారీ ప్రణాళిక

గడ్డిపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. అనుకున్న ప్రకారం ప్రవేశాలు ప్రారంభించేందుకు వీలుగా అధికారులు, నిర్మాణ సంస్థ వారాల వారీగా సమగ్ర పనుల ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణంలో జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. నిర్ణయించిన కాలపట్టికకు అనుగుణంగా పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆధునిక తరగతి గదులు, వసతి గృహాలు, క్రీడా సదుపాయాలు, ఇతర విద్యార్థి వసతులన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా గడ్డిపల్లి పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి తెలిపారు.

గ్రామీణ తెలంగాణ భవిష్యత్తుపై పెట్టుబడిగా ఈ పాఠశాలను అభివర్ణించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ప్రముఖ పాఠశాలలతో సమానమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గ్రామీణ, గురుకుల విద్యాసంస్థల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మౌలిక వసతుల కొరతను ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా పరిష్కరిస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. అనేక విద్యాసంస్థలు అద్దె భవనాల్లో లేదా సరిపడని భవనాల్లో నడుస్తూ తరగతి గదులు, వసతి, పారిశుద్ధ్య సదుపాయాల కొరతను ఎదుర్కొన్నాయని చెప్పారు. గ్రామీణ పిల్లలకు కూడా ఇతర ప్రాంతాల్లో లభించే నాణ్యమైన విద్య, సదుపాయాలు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 105 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రూ.200 కోట్లతో చేపట్టిన గడ్డిపల్లి పాఠశాల ఈ కార్యక్రమంలో భాగమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీతోపాటు ఇతర వర్గాల విద్యార్థులు కలసి చదువుకునేలా నాణ్యమైన విద్య, వసతి, క్రీడా సదుపాయాలు, సమగ్ర విద్యార్థి సహాయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు.

గడ్డిపల్లి ప్రాజెక్టును మంజూరు చేయడంతోపాటు మారుమూల ప్రాంతానికి స్వయంగా వచ్చి పనులను సమీక్షించిన భట్టి విక్రమార్కకు ఉత్తమ్ కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ సంస్థకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తున్న ఆర్థిక శాఖకు ధన్యవాదాలు చెప్పారు. భూమి, అనుమతులు, పాఠశాలకు చేరుకునే రహదారి ఏర్పాట్లలో సహకరించిన సూర్యాపేట జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పాఠశాల, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలను నిర్దేశిత గడువుల్లో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

హుజూర్‌నగర్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

గడ్డిపల్లి పాఠశాలతో హుజూర్‌నగర్ నియోజకవర్గం, పరిసర గ్రామీణ ప్రాంతాల పిల్లలకు ఇంటికి చేరువలోనే నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని ఉత్తమ్ తెలిపారు. హుజూర్‌నగర్‌ను తెలంగాణలోని అగ్రగామి నియోజకవర్గాల్లో ఒకటిగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తానని తెలిపారు. మునగాల కమ్యూనిటీ కిచెన్, గడ్డిపల్లి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా గ్రామీణ సూర్యాపేటలోని పిల్లల జీవన ప్రమాణాలు, పౌష్టికాహారం, విద్యావకాశాలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రులు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు కృతజ్ఞతగా ఘనంగా సేవా జ్యోతి యాత్ర

వికసిత్ భారత్--2047 సాధనకు సంకల్పంతో హుస్నాబాద్ నుంచి సిద్దిపేట వరకు కొనసాగిన బైక్ ర్యాలీ

హుస్నాబాద్ (వాయిస్ టుడే ప్రతినిధి) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు కృతజ్ఞతగా, వికసిత్ భారత్--2047 సాధనకు సంకల్పంగా నిర్వహిస్తున్న పీఎం సేవా సంకల్ప అభియాన్లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి సేవా జ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సేవా జ్యోతి పోగ్రాం బాద్యులు బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సహచర బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సేవా జ్యోతి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం సేవా జ్యోతి బైక్ ర్యాలీకి కోహెడ క్రాసింగ్ వద్ద బీజేపీ మండలశాఖ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. బస్వాపూర్ గ్రామంలో స్థానిక బీజేపీ నాయకులు ర్యాలీకి స్వాగతం పలికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి సేవా జ్యోతి ర్యాలీ సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండ భూదేవి గార్డెన్ వరకు కొనసాగింది.

కొండ భూదేవి గార్డెన్లో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అధ్యక్షతన సేవా జ్యోతి జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ , బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వర్చువల్గా ప్రసంగించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం కొండ భూదేవి గార్డెన్ నుంచి వేంకటేశ్వర టెంపుల్ వరకు సేవా జ్యోతి ర్యాలీని ఘనంగా నిర్వహించారు. బైక్ ర్యాలీతో పాటు పార్టీ శ్రేణుల నినాదాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. హుస్నాబాద్ పట్టణం నుంచి నిర్వహించిన సేవా జ్యోతి ర్యాలీలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ ఖమ్మం వేంకటేశం, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్, రాష్ట్ర నాయకులు లక్కిరెడ్డి తిరుమల రెడ్డి, తోట స్వరూప, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, ఎల్కతుర్తి, బిందెవరపల్లి మండలాల బీజేపీ అధ్యక్షులు బుక్యా సంపత్ నాయక్, రామంచ మహేందర్ రెడ్డి, జాలిగం రమేష్, పోలోజు సంతోష్, దంచానల శ్రీనివాస్, మంతుర్తి శ్రీకాంత్, శ్రీరామోజు శ్రీనివాస్ తో పాటు వివిధ రాష్ట్ర, జిల్లా బాధ్యతల్లో ఉన్న నాయకులు గుగ్లోత్ తిరుపతి నాయక్, తక్కళ్లపల్లి సంపత్ రావు, లకావత్ శారద, మెడబోయిన స్వరూప, బానాల జయలక్ష్మి, షణ్ముఖి, వెల్దండి రాజేంద్రప్రసాద్, బొల్లి శ్రీనివాస్, పిల్లి నర్సయ్య, మదన్మోహన్ రెడ్డి, జనగామ వేణుగోపాల్ రావు, తోట సమ్మయ్య, తగురం లక్ష్మణ్, మ్యాకాల సురేందర్ రెడ్డి, కాతాం రాజశేఖర్ రెడ్డి, నాగు అజయ్, కంది సత్యనారాయణ రెడ్డి, బైరం అనిల్, మడక రవికుమార్, భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

వీరితో పాటు ఆయా మండలాల ప్రధాన కార్యదర్శులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని సేవా జ్యోతి యాత్రను విజయవంతం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి సేవా జ్యోతి ర్యాలీని విజయవంతం చేసేందుకు పెద్దఎత్తున తరలివెళ్లిన కరీంనగర్ పార్లమెంట్ హుస్నాబాద్ అసెంబ్లీలోని ప్రతి బీజేపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు కేంద్రమంత్రి బండి సంజయన్న తెలిపారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ స్ఫూర్తితో వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ అంకిత్

ఖమ్మం: జిల్లాలోని మూకమామిడి ఏకలవ్య పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో పాటిస్తున్న విధానం, విద్యార్థుల హాజరు, పరీక్షల సమయంలో తీసుకుంటున్న చర్యలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని ఏకలవ్య పాఠశాలలకు ఒకే ప్రశ్నపత్రాన్ని రూపొందించి పంపిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కలెక్టర్‌కు వివరించారు. వంటకు వినియోగిస్తున్న కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను ఈ సందర్భంగా కలెక్టర్ పరిశీలించారు. కూరగాయలను నేలపై ఉంచితే క్రిమికీటకాలు చేరి ఆహారం కలుషితమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. కూరగాయలను ర్యాకులు సురక్షితంగా నిల్వ చేయాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలు, కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం పాఠశాలలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన మందులు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, ఆరోగ్యకరమైన ఆహారం, అవసరమైన వైద్య సదుపాయాలు అందేలా పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ములకలపల్లి తహసిల్దార్ స్వాతిబిందు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.